


ఎ.రాజరాజేశ్వరి

# పరుగో...పరుగు

ఎమ్‌సెట్‌లో ర్యాంకు రావడంతో కౌన్సిలింగ్ హడావిడి మొదలయ్యింది. కాకినాడలో జాయినవుదామని నిర్ణయించుకున్నాను. అయితే హాస్టలులో సీటు దొరికింది కానీ, మా కాలేజి ఓపెన్ చేసిన నాలుగు రోజులకు కానీ, రూము అలాట్ చేయలేమన్నారు. నేనుండబోయే రూములో సీనియర్సింకా ఖాళీ చేయలేదుట. అందుకు నాలుగు రోజులు బయటే ఎక్కడో నా తంటాలు నేను పడాలి.

నా సమస్య విన్న నాన్న తేలికయిన పరిష్కారం చూపించారు.

"నువ్వంత గాభరాపడే అవసరం లేదులే! రామారావుపేటలో మా చిన్నమామ్మ కూతురు, ఆవిడ కొడుకు, కోడలు పిల్లలు అక్కడే వుంటున్నారు. నాలుగురోజులే కదా! మంచి కంపెనీ యిస్తారు ఇట్టే టైం గడిచిపోతుంది" అన్నారు నాన్న.

వాళ్ళ గురించీ అమ్మ చాలాసార్లు చెప్పింది. "ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరూ వింతగా ప్రవర్తిస్తారు. మాటకు ముందు సామెత మాట్లాడతారు. అసలు సామెతలనే మాటలుగా వాడతారు. వాళ్ళతో ఒక్క రోజు గడిపామంటే బుర్రవాచిపోతుంది"

అమ్మ మాటలు గుర్తొచ్చి వాళ్ళింట్లోనా అంటూ మొహం చిట్లించాను. తన వాళ్ళననలు విమర్శించడం నాన్నకిష్టం వుండదు. నా ఉద్దేశ్యం గ్రహించిన నాన్న నన్ను మందలించారు. "నాలుగు రోజులే కదా! మరేం ఫరవాలేదు. రాకపోకలుంటేనే బంధుత్వాలు నిలుస్తాయి. నువ్వు వస్తున్నట్లు మా అత్తావాళ్ళకు ఫోను చేసి చెప్తాను" అని అనడమే కాదు వెంటనే ఫోను చేసేసారు. "అత్తా..నేను వెంకట్రావుని. మీరంతా ఎలా వున్నారు? ఆ..మరేం లేదు. నా కొడుకు శ్రీనాథ్ ఇంజనీరింగులో జాయినవుతున్నాడు. అవునవును. మీ ఊర్లోనే సీటు దొరికింది. హాస్టలులో చేరడానికి నాలుగు రోజులు టైం పడుతుంది. అంతదాకా మీ యింట్లో వుంటాడు" అటు నుండీ ఏం జవాబు వచ్చిందో కానీ, బిగ్గరగా నవ్వుతూ, "అదేం కాదులే అత్తా...త్వరలోనే కలుద్దాం" అని ఫోను పెట్టేసాడు.

అమ్మ నన్ను రహస్యంగా పిలిచి చెప్పింది. "జాగ్రత్తరా బుజ్జీ! సాధ్యమయినంత వరకూ ఎక్కువ మాట్లాడక, నీ పనేదో చూసుకొని బయటపడు" అంది.

అమ్మెందుకింతగా చెపుతోంది. అంత కష్టమా! వారిని భరించడం తినబోతూ రుచి దేనికిలే అని నాలిక్కొరుక్కుని, నాలో నేనే నవ్వుకున్నాను. ఇంకా అక్కడికి వెళ్ళకుండానే వారి గాలిసోకినట్లుంది. సడన్‌గా ఒక చిలిపి ఆలోచన వచ్చి వారెన్ని రకాల సామెతలు వాడుతారో రాసిపెట్టుకోవాలని ఒక నోటుబుక్కు, పెన్ విడిగా పెట్టుకున్నాను.

కాకినాడ స్టేషనుకి మావయ్య వచ్చాడు. నన్ను గుర్తుపట్టి "నువ్వు బుజ్జివి కదూ! సరిగ్గానే గుర్తుపట్టాను. మా బావ అరటి పండు వలిచి చేతిలో పెట్టినట్టు చాలా వివరంగా చెప్పాడు. అయినా ముంజేతి కంకణానికి అద్దం ఎందుకు? అచ్చుగుద్దినట్టు వాడి పోలికలతోనే వున్నావు. విత్తనం ఒకటీ, మొలక వేరొకటీనా.." మావయ్య సామెతల ప్రహసనం అలా సాగిపోతుంటే, నేను కంగారుపడిపోయి "అమ్మ నాన్నగారు మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు" అంటూ టాపిక్ డైవర్టు చేసాను.

ఆ రోజు ఆదివారం కావడాన, మావయ్య పిల్లలు మధుమతి, కిషోర్ యింట్లోనే వున్నారు. మధు ఇంటర్, కిషోరు టెన్త్ చదువుతున్నారు. నాన్న గారి అత్తయ్య భానుమతి వత్తులు చేసుకుంటోంది.

"బాగున్నారా! బామ్మగారూ.." అంటూ అరటి పళ్ళు చేతిలో పెట్టాను.

"నువ్వు మా వెంకడి కొడుకువి కదూ! ఈమధ్యన రాకపోకలు తగ్గిపోయాయి. ఈ ఊరికావూరు ఎంత దూరమో...ఆ ఊరికీవూరూ...అంతేదూరం. ఇక నా ఆరోగ్య సంగతేమిటిలే.. ఊరుపొమ్మంటోంది. కాదు రమ్మంటోంది" అంది నన్ను పరికించి చూస్తూ.

నేను వచ్చే నవ్వు బిగపట్టుకొని అత్తయ్యని పలకరించాను. "ఇల్లు చాలా బాగుందత్తయ్యా" అన్నాను మెచ్చుకోలుగా.

నా పొగడ్తకి అత్తయ్య మొహం వెలిగిపోయింది. "ఇంటికళ ఇల్లాలే చెబుతుంది. ఇంటికి దీపం ఇల్లాలని అందుకే అంటారు. ఇంతకుముందు చిన్న అద్దింట్లో వుండేవాళ్ళం. మీ మావయ్య చెవినిల్లుకట్టుకొని పోరేము. ఆయనింట్లో పులి, వీధిలో పిల్లి. తను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళన్న మొండి మనిషి. స్వంతిల్లు కట్టుకుందాం అని చిలక్కి చెప్పినట్టు నచ్చ చెప్పాము. 'అప్పుచేసి పప్పుకూడు' నాకిష్టం లేదు. 'అప్పులేని వాడే అధిక సంపన్నుడు' అని 'మొండి వాడు రాజుకన్నా బలవంతుడ'ని నిరూపించుకున్నారు మీ మావయ్య. ఆఖరికి 'ఇంటి పోరు ఈశ్వరుడు కూడా భరించలేడన్నట్టు'గా 'ఇచ్చేవాడు దొరికితే, చచ్చేవాడు లేచి కుంటాడన్నట్టు' ఎలాగో లోను సంపాదించి ఇల్లుకట్టగలిగాం"

అత్తయ్య నాన్ స్టాప్ సామెతలకు నా బుర్ర వాచిపోయింది.

"ఇల్లలకగానే పండగకాదు, తోరణం కట్టినగానే పెళ్ళీ...కాదు" అని మావయ్య ఏదో చెప్పబోతుంటే, ఆపద్బాంధవి నానమ్మ అడ్డుకుంది.

"వీడు ప్రయాణం చేసి యిప్పుడే కదా వచ్చింది. ఎప్పుడో జరిగిపోయిన పెళ్ళికి బాజాలెందుకు? పదండి ఫలహారాలు తిన్నాకా మాట్లాడుకుందాం" అంది డైనింగ్ హాల్లోకి దారితీస్తూ.

ఇడ్లీ, వడ బ్రేక్‌ఫాస్ట్. ఇడ్లీ చూసి కిషోర్ మొహం చిట్లించాడు. "ఇడ్లీలు నాకిష్టం వుండదు, వద్దు" అన్నాడు.

"పోనీ గారెలు తిను బాగుంటాయి" అంది అత్త వడ్డించబోతూ.

"ఎద్దునడిగి గంతలు కడతారా ఎవరయినా,



పైత్యపు రోగికి పంచదార కూడా చేదుగానే వుంటుంది. ఇడ్లీలు మెత్తగా దూదుల్లా వున్నాయి. ఎద్దుకేం తెలుస్తుంది...అటుకుల రుచి" నానమ్మ దండకానికి దడిసి వాడు గబగబా తిని వెళ్ళిపోయాడు.

"కూసే గాడిద వచ్చి, మేసే గాడిదను చెడగొట్టిందన్నట్టు వాడు తినలేదని నువ్వు కూడా తినకుండా లేవకు. ఏం కావాలో అడిగి కడుపునిండా తిను" అంది అత్త.

"ఒరేయ్! బాబూ రెండే తిని లేచావు. భోజనం లేటవుతుంది. ఇంకో రెండు తిను. అడగందే అమ్మయినా పెట్టదంటారు" అంటోంది నానమ్మ.

నేను తినడం ఆపి, కిశోరు వైపు కుతూహలంగా చూసాను. వాడెటువంటి సామెత వాడతాడా అని? కానీ అలాంటి ప్రమాదం లేకుండా, "ట్యూషన్‌కి వెళ్ళి, డౌట్లు చెప్పించుకోవాలి. నాకు టైమవుతోంది వెళ్ళొస్తా" నని బయలుదేరాడు.

'హమ్మయ్య! సామెతవాడని మాట మొదటి సారి' అనుకొనే లోపుగా "లంక మేత గోదారి ఈతకు సరిపోతుంది అంటారు. అమ్మ చెప్పినట్టు ఇంకొక రెండు తిను" అంటోంది నానమ్మ. మావయ్య వినుక్కున్నారు. "కడుపునిండిన వాడికి గారెలు చేదంటారు. వాడి గురించీ వదిలేయండింక. గుర్రాన్ని నీటి వరకూ తీసుకురాగలం కానీ, బలవంతాన నీళ్ళు తాగించగలమా!" అన్నాడు.

నాన్నమ్మ అలిగింది. "వెర్రినాగన్నా! సరిగా తిండి తినలేదని చెప్పాను. అయినా నాకెందుకులే! కందకు లేని దురద కత్తిపీటకు అంతే మరి! ఉపకారానికిపోతే అపకారం ఎదురుకావడం అంటే నోరు మూసుకోవడం అంత ఉత్తమం లేదు" నానమ్మ రుసరుసలాడసాగింది.

"ఎందుకమ్మా ఆ నిష్ఠూరాలు, మన గొడవలు అద్దం మీద ఆవగింజల్లా వుండాలి" అంటున్నాడు మావయ్య తల్లిని శాంత పరుస్తూ.

వారి సామెతల జోరుకి నా బుర్ర పని చేయడం మానేసి, బరువువెక్కిపోయింది.

అమ్మ ఫోను చేయడంతో యాంత్రికంగా మాట్లాడసాగాను.


అమ్మ ముందుగానే హెచ్చరించింది. "నేనని చెప్పక, నీ ఫ్రెండని చెప్పు. ఇప్పుడు వాళ్ళని పలకరిస్తే, వాళ్ళ సామెతల జోరుకి నా బుర్ర వాచిపోతుంది. మీ నాన్నగారితో పాటు మళ్ళీ మాట్లాడతాను. ఎలా వుంది? నీకక్కడ యిబ్బందిగా లేదు కదా" అంటోంది.

"తర్వాత మాట్లాడతా"నని ఫోను పెట్టేసాను.

టిఫిన్ల పర్వం ముగించి కాఫీ తాగుతూ, అత్తా కోడలు పనిమనిషి గురించీ కాబోలు చర్చించుకుంటున్నారు. నేను పేపరులో తలదూర్చి చదవాలని ప్రయత్నించినా, వారి సంభాషణలు నా చెవిలో దూరుతున్నాయి.

"నేను చెబితే విన్నావు కాదు రంగమ్మని పనిలో పెట్టుకోవడం అంటే, డబ్బిచ్చి తద్దినం కొనుక్కోవడమేనని. దాని కోడలు చీటికీ మాటికీ దుమ్మాలు కొడుతుందని దాన్ని మానిపించి, దీన్ని పనిలో చేర్చావు. కోడలుకి బుద్ధి చెప్పి, అత్త తెడ్డు నాకడం అంటే యిదే మరి"

నాన్నమ్మ సణుగుతుంటే అత్త కల్పించుకుంది. "నెమ్మదిగా అనండి. గోడలకు చెవులుంటాయి. పక్కింటావిడ విందంటే రంగమ్మకి మోసేస్తుంది. దానితో దెబ్బలాటంటే కొరివితో తల గోక్కున్నట్లే! 'అది లోనే హంస పాదులా' యిలా చేస్తుందని నేననుకున్నానా. ఇలాంటి వారికి 'కీలెరిగి వాత పెట్టాలి'. 'అంగట్లో అన్నీ వున్నాయి.



అల్లుడి నోట్లో శని' అన్నట్లు ఈ రోజుల్లో సరయిన పనివాళ్ళే దొరకడం లేదు. మనం గట్టిగా అన్నామంటే, 'కొండనాలుకకు మందేస్తే, ఉన్న నాలుక ఊడినొ చందాన అవుతుంది. నోరు మంచిదయితే, ఊరు మంచిదవుతుంది అన్నట్టు దెబ్బలాడకుండా యిలాంటివారిని మంచి చేసుకోవడం ఒకటే మార్గం"

నా చెవుల్లో జోరీగలు దూరినట్లు ఒకటే రొద మొదలయింది. సామెతల మోత విని విని, ఇంకా నాలుగు రోజులు ఎలా గడపాలోనని దిగులు మొదలయింది. ప్రతి చిన్న విషయానికి కూడా కొండవీటి చాంతాడంత పొడవుగా సామెతల వర్షం కురిపిస్తున్నారు. బాప్‌రే! సేవ్ మీ గాడ్! అనుకున్నాను.

దేవుడు నా మొరాలకించినట్లుయి, "రా బుజ్జి బావా...నా గది చూద్దువుగానీ" అని మధురిమ తన గదిలోకి లాక్కుపోయింది.

ఆ అమ్మాయి మంచి మాటకారి. పెద్దవాళ్ళంత కాకపోయినా, ఈ పిల్ల కూడా సామెతల బాణాలు వదులుతూనే వుంది.

"కిషోరు కష్టపడి చదువుతాడు కానీ, కొంచెం జ్ఞాపకశక్తి తక్కువ. నాకు టెన్త్‌లో స్కూలు ఫస్టు వచ్చిందని, వాడికీ రావాలని ఆశ! 'పులిని చూసి నక్కవాత పెట్టుకోవడం' అంటే యిదేమరి. ముందు చదువుకున్నది గుర్తుపెట్టుకో! లేకుంటే ఎంత శ్రమపడ్డా, అది 'బూడిదలో పోసిన పన్నీరే' అంటారు నాన్న"

'ఇదేం గొడవరా బాబూ! ఎవరు నోరువిప్పినా ఈ సామెతల చాకిరేవుతో నన్ను వుతికిపారేస్తున్నారు. ఒక్కరు కూడా సామెత వాడకుండా తిన్నగా మాటాడరా! ఈ ఊర్లో చదువుకోవడం వరకు ఏమో కానీ, ఈ యింట్లో వున్న నాలుగు రోజులకు నా జుట్టు పూర్తిగా వూడి చేతిలోకి రావడం ఖాయం' అనుకున్నాను. కిటికీలో నుండీ గాలికి వూగే పూల మొక్కలు చూస్తూ.

సాయంత్రం కాసేపు అలా బయటికి తిరిగొచ్చి, కాసేపు వారి దాడి నుండీ తప్పించుకున్నాను.

ఆ రాత్రి భోజనాల దగ్గర మావయ్య రెండు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లు వేగంగా ఢీకొన్నంత రేంజిలో నా నెత్తిన బాంబు వేసాడు. ఉదయం నుండి సామెతలకు ఎలాగో అలవాటుపడ్డ నేను వారి మాటల మీద కాక, తిండిమీద దృష్టి నిలిపి తినసాగాను.

"అయినవాళ్ళం ఊర్లో వుండగా వీడెక్కడో తిండికి యిబ్బంది పడుతూ హాస్టలులో వుండడం దేనికి? నాలుగేళ్ళు యిట్టే గడిచిపోతాయి. మనింట్లోనే వుండి రోజూ కాలేజీకి వెళ్ళొస్తూ యిక్కడే చదువుకుంటాడు"

నానమ్మ ఆ మాటలకు వంత పాడింది. "అవునవును. వీడేం పరాయివాడా! స్వయానా మా వెంకడి కొడుకు, నాకు మనవడు. మనకీ ఆలోచన ముందుగా రాలేదు సుమీ! వాడికి ఫోను చేసి చెప్పేసెయ్! కలో, గంజో తాగి మనతోపాటే వుంటాడిక్కడ"


"అవును నిజమే! అయినవాడు, బుద్ధిమంతుడు, వీడు స్థిరపడ్డాకా మన మధునిచ్చి పెళ్ళి చేసేద్దాం" అంటోంది అత్త.

వాళ్ళ మాటలు వింటున్న నాకు పచ్చివెలక్కాయ గొంతుకు అడ్డంపడినట్లుయి, పలమారిపోయింది. ఇక తిన బుద్ధికాక, ఏ కాస్త తినేసి తన గదిలోకి వచ్చిపడ్డాడు.

'ఎరక్కపోయి వచ్చి, ఇరుక్కుపోయాను' మైగాడ్! ఒక్కరోజుకే వీరి సామెతలు సముద్రపు హోరులా తన మతిని పోగొట్టసాగాయి. నాలుగేళ్ళు వీళ్ళింట్లో వుండి, తను చదువుకోవాలనుకోవడం జరిగే పనేనా! 'చదవేస్తే వున్న మతి వూడుతుంది' అసంకల్పితంగా నా నోటినుండీ కూడా సామెతలు మొదలుకావడంతో, చిన్నగా తల విదిలించాను.

నేను ర్యాంకు హోల్డర్‌ని. ఈ ఊర్లో కాకపోతే, ఎక్కడయినా మళ్ళీ కౌన్సిలింగ్‌తో వేరే కాలేజీలో సీటు దొరుకుతుంది. 'బతికుంటే బలుసాకు తిని బ్రతకొచ్చును' ఈ యిల్లొదిలితే కానీ సామెతలు నన్ను వదిలేలా లేవు. అప్రయత్నంగా నవ్వుకున్నాను.

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నాన్నకి ఫోను చేసి నా నిర్ణయం చెప్పేసాను. మావయ్య తనింట్లో



## ష్! అంతేలెండి!!

*ఇటీవల రిలీజ్ అయిన 'మైనేమ్ ఈజ్ ఖాన్' సినిమాలో షారుఖ్ ఖాన్ కంటే కాజోల్ నటనకు మంచి మార్కులు పడుతున్నాయి. అయితే కాజోల్‌కి ఇంత పేరు తీసుకొస్తున్న ఈ సినిమాని ఇంతదాకా ఆమె భర్త, హీరో అజయ్ దేవ్‌గన్ మాత్రం చూడలేదట. తన సినిమాల బిజీతో భార్యగారి సినిమా గురించి పెద్దగా పట్టించుకోవడం లేదట అజయ్. దాంతో కాజోల్‌కి కాస్త కోపం వచ్చిందని సన్నిహితుల ఉవాచ. ఎంత విశాల భావాలతో మసలుకుంటున్నా- సహజమైన మానవ ఈర్ష్యాసూయలు ఎక్కడికిపోతాయి?*

వుంచుకోవాలనుకోవడం కూడా చెప్పి, "నన్నిక్కడే వుంచాలను కుంటే ఇంజనీరింగు క్లాసు కాదు, పాసు కూడా అవను. ఫెయిలయి పోతాను" అని చెప్పేసాను.

నాన్న ఏమనుకున్నారో! "సరేరా! నిర్ణయం నీకే వదిలేసాను. నీకు ఎక్కడ నచ్చితే, అక్కడే చదువుకో" అన్నారు. నాన్న అంత తేలికగా అంగీకరించేసరికి గట్టున పడ్డ చేప తిరిగి నీళ్ళలో పడినంత సంతోషం కలిగి, మనసు తేలిక యింది.




నా నిర్ణయం విన్న మావయ్య కుటుంబ సభ్యులు అంత తేలికగా జీర్ణించుకోలేకపోయారు. యథాప్రకారం మాటల తూటాలను సామెతల రూపంలో వదలసాగారు.

"ఈ ఊర్లో ఇంత మంచి కాలేజీ పెట్టుకొని, ఇంకెక్కడో చేరుతానంటావేమిటి? 'నీ తెలివి తెల్లారి నట్లే వుంది'. చదవాలనుకునే వాడికి ఏ కాలేజయినా ఒకటే. 'ఆకాశానికి నిచ్చెన వేయక, వచ్చిందే దక్కుడు' అని తృప్తిపడు. ఇదీ పోగొట్టుకొని, ఇంకో చోట సీటు రాకపోతే త్రిశంకు స్వర్గంలా అవుతుంది నీ పని. 'కొండ నాలుకకు మందెయ్యాలనుకొంటే, వున్న నాలుక వూడి చేతికొస్తుంది' మా మాట విని యిక్కడే చదువుకో. అంతగా నీకు మా యింట్లో వుండడం యిష్టం లేకపోతే, హాస్టలులోనే వుండు. పండగకి, పబ్బానికి వచ్చి వెళుదువు గాని.." మావయ్య శతవిధాలా నచ్చచెప్పాలని ప్రయత్నిస్తున్నాడు.

"ఏమో లేరా! వాడెందుకు వెళ్ళి పోవాలనుకుంటున్నాడో! నీరు పల్లమెరుగు నిజం దేవుడెరుగు! మనసులోకి దూరి చూడలేము కదా" అంది నానమ్మ పెదవి విరుస్తూ.

అత్తయ్య నా వైపు ఆరాగా చూసింది. "మా వలన ఇబ్బంది ఏమయినా కలిగిందా! మనసుంటే మార్గముంటుంది. నిక్షేపంలా యిక్కడ సీటొస్తే, యింకెక్కడికో పోతానంటావేమిటి? నీలాంటి వాడే వెనకటికి 'వెర్రి కుదిరింది, తలకి రోకలి చుట్టమన్నాడట' అయినా ఎవరి వెర్రి వారికానందం. నిన్ను సరిగా చూసుకోలేదన్న నింద మా మీద రానీయకు. నీ మనసులో ఏమయినా వుంటే, యిప్పుడే చెప్పు. అంత్య నిష్ఠూరం కన్నా, ఆది నిష్ఠూరం మేలు" అంది.

వారి సామెతల జడివానలో తడిసి ముద్దయిపోతున్నాను. వారికి నా మీదున్న ప్రేమకు కూడా మనసు కరుగుతోంది.

అయినాసరే- మనసు చిక్కబట్టుకొని వారందరికీ చేతులు జోడించాను.

"అదేంలేదు. నేనసలు ఈ ఊర్లోనే చదవాలని వచ్చాను. కానీ, నా బెస్టు ఫ్రెండుకి వేరే కాలేజీలో సీటొచ్చింది. నన్నక్కడికి వచ్చేసి చేరమని ఫోను చేసాడు. అందుకే వెళ్ళిపోతున్నాను. శెలవుల్లో మళ్ళీ ఎప్పుడయినా వస్తాను" అన్నాను నా సామానుతో బయలుదేరుతూ.

"సర్లే! నీ కబుర్లతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నావు వెళ్ళిరా" అని అనుమతి రావడంతో, ఇక స్టేషనుకి రిజర్వేషన్ కూడా పట్టించుకోక 'పరుగో పరుగు'.

## కరీనా కనికరించింది

**కరీనా** కపూర్-షాహిద్ కపూర్ జంటగా నటించిన 'జబ్ వుయ్ మెట్' సినిమా తర్వాత అంటే దాదాపు మూడేళ్ల తర్వాత ఇద్దరూ కలిసి నటిస్తున్న 'మిలేంగే-మిలేంగే' సినిమా చాలా కాలంగా పూర్తికాకుండా వుండిపోయింది. ఎప్పుడూ ఏదో సాకుతూ ఈ సినిమాకి దూరంగా వుంటూ వచ్చిన కరీనా ఇప్పటికి కనికరించినట్టుంది. డబ్బింగ్ కార్యక్రమానికి హాజరై పూర్తి చేసిందిట. అలాగే ప్రమోషనల్ వీడియోలకి కూడా సహకరించిందిట. దీంతో నిర్మాత బోనీకపూర్-దర్శకుడు సతీష్ కౌశిక్‌లు బోల్డు సంబరపడుతున్నారట. త్వరలోనే ఈ సినిమా వెలుగుచూస్తుందన్నమాట.

